క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

డెంకాడ: మండలంలోని గుణుపూరు – డెంకాడ గ్రామాల సరిహద్దులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుందరాకాండ పారాయణం నిర్వహించారు. 108 రోజుల సంకల్పంతో హనుమత్ పీఠాన్ని స్థాపించి ఆంజనేయస్వామికి ప్రతినిత్యం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ప్రత్యేక హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు జగన్నాథాచార్య స్వామి, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నెల్లిమర్ల: నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు జరగాలని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు వచ్చేనెల 4న జరగబోయే కౌంటింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లెక్కింపులో ఎటువంటి తేడాలు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ ఎం. నూకరాజు, ఏఆర్‌ఓలు డి. ధర్మరాజు, జె. రామారావు, ప్రవల్లికప్రియ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



యువతి తల్లికి నగదు అందజేస్తున్న పారసాం యువకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం గ్రామానికి చెందిన యువకులు తమ సేవానిరతిని చాటుకున్నారు. గుర్ల మండలంలోని భూపాలపురం గ్రామానికి చెందిన నిరుపేద యువతి వెంకటలక్ష్మి ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. చికిత్సకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కావడంతో కుటుంబ సభ్యులు దాతల సహకారాన్ని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సందేశానికి స్పందించిన పారసాం యువత తమవంతుగా రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం సదరు యువతి కుటుంబ సభ్యులకు అందజేశారు.

హెల్మెట్ తప్పనిసరి



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నెల్లిమర్ల: వాహనదారులు హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని భోగాపురం సీఐ బి. వెంకటేశ్వరరావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేటలో కార్డన్‌సెర్చ్‌లో భాగంగా గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై డి. రామగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతం కళాశాలలో జాతీయ సమైక్యతా ర్యాలీ

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ 2(ఏ) గర్ల్స్ బెటాలియన్ వార్షిక శిక్షణ తరగతుల క్యాంప్ గురువారం కొనసాగింది. ఇందులో భాగంగా జాతీయ సమైక్యత అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ.. జాతీయ సమైక్యత అనేది ప్రజలందిరినీ సన్మార్గంలో నడిపించే విధానమని, ఎన్‌సీసీ క్యాడెట్లుగా దాన్ని బాధ్యతగా గుర్తు చేసుకోవాలని సూచించారు. కుల, మత, వర్గ, వర్ణ బేధం లేకుండా మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన్ని ఎన్‌సీసీ క్యాంప్ అధికారులు సత్కరించారు. క్యాంప్‌లో కమాండెంట్ కల్నల్ గోపీంద్ర, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేణి, సుబేదార్ మేజర్ బొడ్డే, పరమేశ్వర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్స్ లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, థర్డ్ ఆఫీసర్ వెంకట రత్నం, లెఫ్టినెంట్ సంతోషి, వరలక్ష్మి, తులసి, లక్ష్మీప్రసన్న, గౌరీ, వెంకట రమణమ్మ, ధనశ్రీ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం మూడు జిల్లా నుంచి విచ్చేసిన 600 మంది వరకు ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

- ఎక్కువ సమయం మరిగించే నూనెలతో ప్రమాదకర జబ్బులు
- టీపీసీ 25 దాటితే టాక్సిన్లు విడుదలవుతాయంటున్న నిపుణులు
- తనిఖీల్లో 15 కేసులు నమోదు చేసిన అధికారులు
- హోటళ్లు, రెస్టారెంట్‌లు, బేకరీల్లో నూనెల పునర్వినియోగానికి అడ్డుకట్ట
- ఒక్కసారి వినియోగించిన నూనెను కొనుగోలు చేసేందుకు స్టార్ గ్లోబల్ ఏజెన్సీతో ఒప్పందం
- ఫుడ్ సెఫ్టీ అధికారుల సమన్వయంతో నూనె సేకరణకు ప్రత్యేక డబ్బాల పంపిణీ



ఇటువంటి నూనెలతో తయారు చేసే ఆహార పదార్థాలతో బహుపరాక్



హోటళ్లలో వినియోగించిన నూనెను కొనుగోలు చేసే స్టార్ గ్లోబల్ ఏజెన్సీ

మరిగిస్తే మరింత విషం

టీపీసీ మోతాదు మించితే...

- ఆహారం సరిగ్గా జీర్ణం కాదు
- గుండె జబ్బులు వస్తాయి.
- హైపర్ టెన్షన్ వస్తుంది.
- గ్యాస్ట్రిక్ డిజార్డర్స్‌తో పేగులకు రంధ్రాలు పడతాయి.
- కాలేయం సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.
- 120 డిగ్రీల కంటే అధిక సెల్సియస్‌లో వేడి చేసే బంగాళదుంపల చిప్స్ వల్ల అధిక ప్రమాదం
- టీపీసీ వల్ల నూనెలు ట్రైగ్లిజరాయిడ్స్‌గా మారి శరీరానికి హని కలిగే అవకాశం ఉంది.

విజయనగరం: ప్రజారోగ్యంతో చెలగాట మాడుతున్న హోటల్స్, రెస్టారెంట్, బేకరీ నిర్వాహకులపై ఉక్కుపాదం మోపేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ప్రధానంగా ఆహార పదార్థాల తయారీలో కీలకమైన నూనె వినియోగంపై నిబంధనలు విధించింది. ఇకపై మరలా, మరలా మరిగించిన నూనెను విక్రయించకుండా చర్యలు ప్రారంభించింది. ఇటీవల ఫుడ్ సెఫ్టీ అధికారులు నిర్వహించిన దాడుల్లో 15 కేసులు నమోదు కావడంతో రానున్న రోజుల్లో అటువంటి నూనెలతో ఆహార పదార్థాలను తయారు చేసేందుకు చెక్ పెట్టే పనిలో పడ్డారు.

రుచి మాటున నాణ్యత ప్రమాణాలు గాలికి...

మారుతున్న ఆహారపు అలవాట్లను ఆసరా చేసుకుని విజయనగరం జిల్లాలో పుట్టగొడుగుల్లా హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు వెలుస్తున్నాయి. కొందరు వంట చేసుకోలేక, మరికొందరు కుటుంభం, స్నేహితులతో కలిసి సరదాగా బయట విందు చేయాలని అనుకునే వారు ఎక్కువయ్యారు. ఈ క్రమంలో కొందరు హోటళ్ల నిర్వాహకులు రుచి మాటను నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. కల్తీ పదార్థాల వినియోగంతో పాటు వంట నూనెలను పలుమార్లు వినియోగించి వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఒకసారి వినియోగించిన నూనెనే మళ్లీ మళ్లీ వినియోగించడంతో ఆహార పదర్థాలు కలుషితమవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అటువంటి ఆహార పదార్థాలు తిన్నవారు ప్రమాదకర జబ్బులకు గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. విజయనగరం జిల్లాలో అధిక శాతం హోటళ్లలో జరుగుతున్న ఈ తంతుతో వేలాది మంది ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఆహారంలో వాడే నూనెలను పదే పదే మరిగించటంతో టీపీసీ (టోటల్ పోలార్ కాంపౌండ్స్) మోతాదు పెరుగుతుంది. వాస్తవానికి ఫుడ్ సెఫ్టీ ప్రమాణాల ప్రకారం టీపీసీ మోతాదు 25కు మించకూడదు. అంతకుమించి ఉంటూ నూనెల్లో టాక్సిన్స్ (విషపదార్థాలు) విడుదల అవుతాయి. ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలను తయారు చేసి వినియోగదారులకు విక్రయిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్‌లలో అధికారులు నిర్వహించిన దాడుల్లో ఇదే విషయం తేటతెల్లమైంది. టీపీసీ 30 నుంచి 35 వరకు నమోదైతే ప్రమాదకరమని.. తినే పదార్థాలు రుచికరంగా ఉన్నా అవి విషంతో సమానమని అధికారులు చెబుతున్నారు.

మూడు నెలల్లో 15 కేసులు నమోదు..

హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో మళ్లీ మళ్లీ మరిగించిన నూనెను వినియోగించడంపై ఫుడ్ సెఫ్టీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గడిచిన మూడు నెలల్లో ఇలా నూనెను వినియోగించే 15 హోటల్స్‌ను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అధికారిక సమాచారం మేరకు నూనె మరిగించే సమయంలో టీపీసీ (టోటల్ పోలార్ కౌంట్) 25కు మించకూడదు. అయితే పలు హోటల్స్, రెస్టారెంట్‌లలో 28 నుంచి 30 వరకు టీపీసీ నమోదవుతున్న నూనెను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రజారోగ్యానికి హాని కల్పిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదించనున్నారు. నేరం రుజువైతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు అపరాధ రుసుం విధించే అవకాశం ఉందని అంచనా.

నూనె డబ్బాల పంపిణీ

ఒక సారి వాడిన నూనెను వ్యాపారస్తుల నుంచి కొనుగోలు చేసేందుకు స్టార్ గ్లోబల్ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో 46 హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలకు డబ్బాలు పంపిణీ చేశారు. వ్యాపారులు ఒక్కసారి వినియోగించిన నూనెను ఆ డబ్బాలలో నిల్వ ఉంచితే సదరు సంస్థ ప్రతినిధులు లీటర్‌కు రూ. 30 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తారు. అలా కొనుగోలు చేసిన నూనెను బయోడీజిల్‌గా వినియోగిస్తారు. త్వరలో ఈ తరహా డబ్బాలను జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువచ్చి వినియోగించిన నూనెను సేకరిస్తారు. దీని వల్ల ఆరోగ్యానికి హాని చేసే నూనె వాడకాన్ని నియంత్రించనున్నారు.



వినియోగించిన నూనెను కొనుగోలు చేసేందుకు స్టార్ గ్లోబల్ ఏజెన్సీ ద్వారా డబ్బాలు పంపిణీ చేస్తున్న ఫుడ్ సెఫ్టీ అధికారులు

అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం..

హోటళ్లలో నూనెల పునర్వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల ఆరోగ్య సంరక్షణకు హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు తపనిసరిగా సహకరించాలి. జిల్లాలో కొన్ని చోట్ల టీపీసీ మోతాదుకు మించి నూనెలు వినియోగించినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ నూనెలు కొనుగోలు చేసేందుకు స్టార్ గ్లోబల్ ఏజెన్సీ ముందుకు వచ్చింది. ఇప్పటికే 46 హోటళ్లలో వినియోగించిన నూనెను సేకరించడానికి ప్రత్యేక డబ్బాలు ఏర్పాటు చేశాం.

– ఈశ్వరి,
అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, విజయనగరం.

హనుమాన్ జయంతికి సర్వం సిద్ధం



ఉత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ చైర్మన్ మడిపల్లి వెంకటాచలం, తదితరులు

విజయనగరం టౌన్: వైశాఖ మాసం బహుళ దశమిని పురస్కరించుకుని జూన్ ఒకటో తేదీన నిర్వహించే హనుమాన్ జయంతికి సర్వం సిద్ధం చేసినట్లు పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ మడిపల్లి వెంకటాచలం తెలిపారు. గురువారం స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్ వెనుక ఉన్న ఆలయం ఆవరణలో ఉత్సవ ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, సింధూరార్చన, లక్ష తమలపాకులతో అర్చనలు చేపడతామన్నారు. మధ్యాహ్నం 11 గంటలకు మహాన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కమిటీ కన్వీనర్ పెంటపాటి కామరాజు మాట్లాడుతూ.. ఉత్సవం రోజు సాయంత్రం 5 గంటలకు చిన్నారులతో స్వామివారికి సింధూరార్చన ఉంటుందన్నారు. అనంతరం 27 రకాల పిండివంటలతో స్వామికి నివేదన చేస్తామని చెప్పారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో పెంటపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు



భోగాపురం మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

భోగాపురం: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. తొలివిడతలో ఒకటి నుంచి ఏడు తరగతుల వారికి 11,582.. ఎనిమిది, తొమ్మిదో తరగతుల విద్యార్థులకు 15,258 పాఠ్య పుస్తకాలు వచ్చాయని, ఇంకా పదో తరగతి పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉన్నాయని ఎంఈఓ రమణ మూర్తి తెలిపారు. తొలి విడతలోనే విద్యార్థులకు బెల్ట్‌లు కూడా వచ్చాయన్నారు. వాటన్నింటినీ వచ్చే నెల మొదటి వారంలో ఆయా పాఠశాలలకు అందజేస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే గత టీడీపీ ప్రభుత్వ హయంలో విద్యా సంవత్సరం ముగిసే దశలోనూ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేవి కావు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టారు. నాడు – నేడు పథకం కింద పాఠశాలల్లో వసతులు మెరుగుపరిచారు. విద్యాకానుక పేరుతో విద్యార్థులకు తొమ్మిది రకాల వస్తువులు (బూట్లు, సాక్స్‌లు, బ్యాగ్‌లు వంటివి) ఇవ్వడమే కాకుండా జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే పూర్తి స్థాయిలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా నాణ్యతతో కూడిన విద్యా కానుకలను విజయవంతంగా ప్రభుత్వం విద్యార్థులకు అందజేసింది. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్లు అందించాలన్నా లక్ష్యంతో విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- ఈఓ ప్రసాదరావు

విజయనగరం టౌన్: సిరుల తల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి భక్తులందరూ సహకరించాలని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కోరారు. ఆలయ ఆవరణలో గురువారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, నిత్యాన్నదానానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకుడు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిగీతాలాపనలో చిన్నారుల ప్రతిభ



భక్తిగీతాలాపన చేస్తున్న చిన్నారి

విజయనగరం టౌన్: జ్ఞాన సరస్వతీ ఆలయ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బాల, బాలికలకు ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించిన వాగ్దేవి భక్తి గీతాల ప్రిలిమ్స్ పోటీలలో చిన్నారులు అద్భుతంగా గానాలాపన చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యక్తిగత, బృంద పోటీలు నిర్వహించారు. ప్రిలిమ్స్‌లో ఎంపికైన చిన్నారులు శుక్రవారం నిర్వహించనున్న ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. శారదా సేవాసంఘ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు, సభ్యులు రాజు, సూర్యలక్ష్మి, శివకుమార్, రమణమూర్తి, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఏఆర్‌టీ కేంద్రంలో ఏబీసీడీ స్వచ్ఛంద సేవా సంస్థ హెచ్ఐవీ బాధితులకు గురువారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ వైద్యాధికారి వరలక్ష్మి మాట్లాడుతూ, బాధితులు మంచి పౌష్టికాహారం తీసుకుని, ఏఆర్‌టీ మందులు వాడితే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. మందులు మధ్యలో మానకూడదని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, ఏబీసీడీ సంస్థ ఉపాధ్యక్షుడు జి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

సస్పెన్షన్లు ఎత్తి వేయాలి..



రౌండ్‌టేబుల్ సమావేశంలో నినాదాలు చేస్తున్న సభ్యులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఆర్టీసీ కార్మిక సంఘ నాయకులపై అక్రమ సస్పెన్షన్లు తక్షణమే ఎత్తివేయాలని కార్మిక , ఉద్యోగ సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పేరుతో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరరావు, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంసన్, ఎన్ఎంయూ తణుకు డిపో కార్యదర్శి సుబ్బారావుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 మందిని ఆర్టీసీ యాజమాన్యం అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ఈ మేరకు సీఐటీయూ, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కేఎల్‌పురంలోని (ఎన్‌పీఆర్ భవన్) ప్రజా సంఘాల కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.జగన్ మోహనరావు, టీవీ రమణ, బి. రమణ, రవికుమార్, వి. రాములు, చంద్రయ్య జి. ప్రసాదరావు, టీవీ కేఎస్ నారాయణ, బి. సుధారాణి, కె.త్రినాథ్, సీహెచ్‌వీ రావు, వి. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



ఎర్రజెండా ఎగురవేస్తున్న యూనియన్ నాయకుడు బాబూరావు

నెల్లిమర్ల: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా యూనియన్ కార్యదర్శి బాబురావు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1970 మే 30న కలకత్తా నగరంలో ఐక్యత – పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడిందన్నారు. ఎమర్జెన్సీని సైతం ఎదుర్కొందన్నారు. వర్గ పోరాట సిద్ధాంతానికి కట్టుబడి కార్మిక, కర్షక ఐక్యత కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని చెప్పారు. రైల్వేలో మొదటి సమ్మె సైరన్ మోగించి నేటికి దేశవ్యాప్తంగా 19 సమ్మెల్లో కోట్లాది మంది కార్మికులను భాగస్వామ్యం చేయగలిగిందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలువురు నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కార్మికవర్గ పోరాటాన్ని ఉధృతం చేస్తాం..

విజయనగరం ఫూల్‌బాగ్: కార్మికవర్గ పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్ మోహనరావు, బి.రమణ అన్నారు. స్థానిక కేఎల్ పురంలోని ఎన్‌పీఆర్ భవన్ వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీవీ రమణ, బి. సుధారాణి, జిల్లా కార్యదర్శులు యూఎస్ రవికుమార్, వి.రాములు, జిల్లా కమిటీ సభ్యులు చంద్రయ్య, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు..

- నియోజకవర్గంలో 31, 689 మంది వేతనదారులకు పనులు
- సరాసరి వేతనం 234 రుపాయలు



పూసపాటిరేగ జంగంబంధలో పనులు చేస్తున్న వేతనదారులు

పూసపాటిరేగ : నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులకు విరామం కావడంతో ఉపాధి పనులకు వేతనదారులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. జాబ్‌కార్డు కలిగిన వేతనదారులందరికీ పనులు కల్పిస్తున్నారు. సకాలంలో వేతనాలు కూడా బ్యాంక్ ఖాతాలకు జమవుతుండడంతో పనులు చేసేందుకు వేతనదారులు కూడా ముందుకు వస్తున్నారు. దీంతో ఉపాధి హామీ పనులు కల్పించడంలో నెల్లిమర్ల నియోజకవర్గం జిల్లాలోనే ముందువరుసలో ఉంది. నెల్లిమర్ల నియోజకవర్గంలో 31,689 మంది వేతనదారులు పనిచేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో భోగాపురం మండలంలో 6709 మంది వేతనదారులు (41 పనులు).. డెంకాడ మండలంలో 7699 మంది వేతనదారులు (30 పనులు).. నెల్లిమర్ల మండలంలో 9595 మంది వేతనదారులు (42 పనులు).. పూసపాటిరేగ మండలంలో 7686 మంది వేతనదారులు 56 పనులు చేస్తున్నారు. వేతనదారులకు ప్రతిరోజూ సరాసరిన 234 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతోంది. జాబ్‌కార్డు ఉన్నవారందరికీ వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గురువారం నాటికి 31,689 వేతనదారులు 169 పనులు చేస్తున్నారు. 2024 – 25 సంవత్సరానికి గాను వేతనదారులకు రోజుకు 300 రూపాయల వేతనం వచ్చేలా పనులు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువులలో పను లు కల్పించడంతో సంతో షంగా ఉంది. రోజు వేత నం 234 రుపాయల వరకు వస్తోంది. వేతనా లు కూడా ఎప్పటికప్పుడు జమ చేస్తున్నారు. దీంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం.

–కోరాడ అప్పన్నమ్మ, పూసపాటిరేగ భూడివీధి

నెలకు ఏడు వేలు..



ఉపాధిహామీ పనుల వల్ల నెల కు సుమారు 7 వేల రూపాయల వరకు వస్తోంది. చేసిన పను లకు గాను సకాలంలో వేతనా లు రావడంతో ఆనందంగా ఉంది. ఉపాధి హామీ పనులుతో పాటు ఇంటి పనులు చేసుకుంటున్నాం. – పెంటమాని రాము, వేతనదారు, పూసపాటిరేగ ఏతపేట

జాబ్‌కార్డుదారులందరికీ పని..



జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం. వేతనదారులకు వ్యవసాయ పనులు లేకపోవడంతో జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఉపాధిహామీ పనులకు వస్తున్నారు. మే నెలలో సుమారు 8 వేల మంది వరకు వేతనదారులు మండలంలో పనిచేశారు. గరిష్ట వేతనం 300 రూపాయలు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. – రత్నమాల, ఏపీఓ, పూసపాటిరేగ మండలం